క్లుప్తంగా

కిడ్నీ బాధితురాలికి బాసటగా సీఎం సహాయనిధి



సీఎం సహాయ నిధి ఎల్ఓసీను అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 18వ వార్డు రాజీవ్‌నగర్‌కి చెందిన మామిడిశెట్టి దుర్గాప్రసాద్ మూడు నెలల చంటి పాప కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఈ పాపకి అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయాలి. దీంతో దుర్గా ప్రసాద్ ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను సంప్రదించారు. దీంతో ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌వోసీని శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దుర్గాప్రసాద్ దంపతులకు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అందజేశారు. సీఎం సహాయ నిధి నుంచి రూ. లక్ష మంజూరు చేయించినందుకు ఎమ్మెల్సీ శ్రీనివాస్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైఖానస్ యూత్ నూతన కార్యవర్గ ఎన్నిక

పెనుగొండ: ఆరు మండలాలవైఖానస్ యూత్ నూతన కార్యవర్గాన్ని జిల్లా సంఘ అధ్యక్షుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. గౌరవ అధ్యక్షుడుగా ఖండవిల్లి శ్రీరామ గోపాలభాస్కరాచార్యులు, అధ్యక్షుడుగా ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు(రమణబాబు), ప్రధాన కార్యదర్శిగా ఖండవిల్లి సీతారామాచార్యులు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసుల వెంకటాచార్యులు, చక్రవర్తుల శేషావతరం, సహాయ కార్యదర్శులుగా వీవీఆర్ శేషాచార్యులు, పెద్దింటి శ్రీనివాసాచార్యులు, ఖండవిల్లి భాస్కర శోభనాద్రాచార్యులు, కోశాధికారిగా శ్రీనివాసుల గోపాలకృష్ణమాచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

సోషల్‌మీడియా కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండ



ముమ్మిడి బాలిరెడ్డితో సత్కరిస్తున్న సోషల్‌మీడియా కార్యకర్తలు

పాలకొల్లు అర్బన్: ప్రవాస సోషల్ మీడియా కార్యకర్తలకు ఏ సమస్య తలెత్తినా ఆదుకోవడానికి, వారికి అండగా నిలవడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని వైఎస్సార్ సీపీ కువైట్ కన్వీనర్ ముమ్మిడి బాలిరెడ్డి హామీ ఇచ్చారు. కువైట్‌లో ఉపాధి నిమిత్తం వెళ్లిన ప్రవాస కార్మికులు సోషల్ మీడియా ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 2024లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడానికి పూర్తిగా సహకరించాలని బాలిరెడ్డి కోరినట్లు పాలకొల్లు మండలం చందపర్రుకి చెందిన కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేసుకుంటున్న బొంధా కుమారస్వామి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు అక్కడ బాలిరెడ్డిని సోషల్ మీడియా యాక్టివిస్టులు కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశామన్నారు.

కొత్తపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: మండలంలోని కొత్తపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల, హేమదుర్గాదేవి, వాణిదుర్గ, మధుసూదనరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి రూ.25 వేల విరాళం



రమాదేవికి విరాళం అందిస్తున్న నాయకులు

పాలకొల్లు అర్బన్: కిడ్నీ రోగులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు వస్తున్నప్పటికీ దాతలు కూడా ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కవురు భాస్కరబాబు అన్నారు. పాలకొల్లు మండలం కొత్తపేటలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పెచ్చెట్టి రమాదేవికి రూ.25 వేలు విరాళాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శులు ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), మానెం జానకీ రామ్‌చంద్ర పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కాళ్ల: జువ్వలపాలెంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి శుక్రవారం చెప్పారు. ఎస్సై కార్యాలయానికి అందిన సమాచారం మేరకు జువ్వలపాలెంలో ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతుండగా, ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20.280 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాడు-నేడుతో సమస్యలకు మోక్షం



నాడు-నేడులో అభివృద్ధి చెందిన సిద్ధాంతం జెడ్పీ పాఠశాల



ఆట స్థలాన్ని మెరక చేస్తున్న దృశ్యం

- వేగంగా సిద్ధాంతం జెడ్పీ పాఠశాల అభివృద్ధి
- ఆటస్థలం సమస్యకు చెక్

పెనుగొండ: దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నూతన కళను సంతరించుకుంది. నాడు-నేడుతో పాఠశాల రూపురేఖలు మారిపోవడమే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన నిర్ణయాలతో పాఠశాలకు పదోన్నతి పొందింది. పెనుగొండ మండలంలో సిద్ధాంతం పాఠశాలకు సిద్ధాంతం, దొంగరావిపాలెం, రామన్నపాలెం, నడిపూడి గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు వస్తుంటారు. పాఠశాలకు సరైన ఆటస్థలం లేకపోవడం, మరుగుదొడ్ల సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండే వారు. దీంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన తర్వాత పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి తీసుకొచ్చిన నాడు-నేడు ద్వార పాఠశాల అభివృద్ధి చెందింది. ముఖ్యంగా పాఠశాల రూపు రేఖలు మారడంతో పాటు విద్యార్థులకు మరుగుదొడ్ల సమస్యకు పరిష్కారం ఏర్పడింది.

జూనియర్ కళాశాలగా పదోన్నతి

సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తయిన అనంతరం ఇంటర్మీడియట్ చదవడానికి విద్యార్థులు ఇటు పెనుగొండ, తణుకు, రావులపాలెం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఎన్నో ఏళ్లగా సిద్ధాంతం గ్రామ పెద్దలు జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నించి అలసిపోయారు. ప్రభుత్వం జెడ్పీ పాఠశాలల్లో 10వత రగతి ప్లస్ అప్‌గ్రేడ్ చేయడానికి నిర్ణయించడంతో సిద్ధాంతం జెడ్పీ పాఠశాలలో మహిళా జూనియర్ కళాశాల ప్రారంభించడంతో సిద్ధాంతం వాసుల కల నెరవేరింది.

యుద్ధప్రాతిపదికన ఆట స్థలం పూడిక

పాఠశాలలో ఆట స్థలం సమస్యను గడపగడపకూ మన ప్రభుత్వంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో యుద్ధ ప్రాతిపథికన గోదావరి మట్టితో పూడిక చేయించి ఆట స్థల సమస్యను పరిష్కరించారు. దీంతో సిద్ధాంతం వాసులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మూడేళ్లలో ఎంతో అభివృద్ధి



సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మూడు సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సహకారంతో పాఠశాలలో జూనియర్ మహిళా కళాశాల ప్రారంభించడంతో సిద్ధాంతం యువతులకు వెతలు తప్పాయి.

– గుత్తుల ప్రసాద్, కమిటీ చైర్మన్

తగ్గని డ్రెయిన్‌ల ఉధృతి

పెనుమంట్ర: మండలంలో రెండు రోజులుగా వర్షం కురవనప్పటికీ గోస్తనీనది, గొంతేరు. భగ్గేశ్వరం డ్రెయిన్‌లు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పల్లపు ప్రాంతాలలో వరినాట్లు ముంపులోనే ఉన్నాయి. గోదావరి వరదనీరు ఉధృతంగా ఉండటంతో పంటకాలుల ద్వారా వచ్చే వరద నీరు డ్రెయిన్‌లకు మళ్లిస్తున్నారు. దీంతో డ్రెయిన్‌లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. డ్రెయిన్‌లలో వంతెనల వద్ద కిక్కిస చెత్త పెరిగిపోవడంతో వాటిని తొలగించడం కూలీల వల్ల సాధ్యం కాకుండా పోవడంతో ముంపు సమస్య మరింత జఠిలంగా ఉంది. వేల్పూరు నుంచి భీమవరం వరకు గోస్తనీ డ్రెయిన్‌లో కిక్కిసను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీఐటీయూ జిల్లాస్థాయి వర్క్‌షాప్ ప్రారంభం

పెనుమంట్ర: జిల్లాలో ఉద్యోగ కార్మికుల సమస్యలపై నిర్విరామంగా కృషి చేసి వారి ఐక్యత కోసం పనిచేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం మార్టేరులో దేవాంగ కల్యాణ మండపంలో జరుగుతున్న సీఐటీయూ జిల్లాస్థాయి వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. కరోనా తరువాత పారిశ్రామిక రంగంలో వ్యవసాయ రంగంలో అనేక మార్పులు వచ్చాయని దీనివల్ల అసంఘిత రంగంలో కార్మిక వర్గం గణనీయంగా పెరిగారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహనరాయ్, జిల్లా అధ్యక్షులు జేఎన్‌వీ గోపాలం, పీవీ ప్రతాప్, బి.వాసుదేవరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, కల్యాణి, ఎం.ఆంజనేయులు, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

మొక్కలే ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ



చింతపర్రులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

నరసాపురం రూరల్: మానవ జీవనం మనుగడ సాగాలంటే మొక్కలే ప్రాణాధారమనే విషయాన్ని నిరంతరం అందరూ గుర్తు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ సూర్యతేజ అన్నారు. శుక్రవారం లక్ష్మణేశ్వరంలో గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మొక్కల నాటిన సబ్‌కలెక్టర్ సూర్యతేజ మొక్క ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ శివప్రసాద్‌యాదవ్, వెలుగు ఏపీఎం పిప్పళ్ల పద్మ, ఎంఈఓ పుష్పరాజ్యం, జాన్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

భట్లమగుటూరులో..

పెనుమంట్ర: సహజ ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం భట్లమగుటూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, వైస్ఎంపీపీ ఈది అనితాప్రతాప్ పాల్గొన్నారు.

ములపర్రులో..

పెనుగొండ: నానాటికి పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ములపర్రు సర్పంచ్ మద్దే రాజేశ్వరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం ములపర్రులో కొబ్బరి, మునగ, నేరేడు మొక్కలు నాటారు. మొక్కలు పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలను మండలాభివృద్ధి అధికారి టి శ్రీనివాస్ దొర తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏ శంకరం పాల్గొన్నారు.

చింతపర్రులో..

పాలకొల్లు అర్బన్: మొక్కలు పెంచడం వలన కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. మండలంలోని చింతపర్రులో సచివాలయ ఆవరణలో, రోడ్లు కిరువైపుల శుక్రవారం ఎంపీపీ కనకలక్ష్మి మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గానుగ, వేప, వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ సులేమాన్, వైసీపీ నాయకుడు చల్లా సాంబయ్య, టెక్నికల్ అసిస్టెంట్ అజరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం కౌన్సిల్ సమావేశం రసాభాస



కమిషనర్‌పై వేలుపెట్టి చూపుతూ దూషిస్తున్న కౌన్సిలర్ భారతి సురేష్

నరసాపురం రూరల్: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. శుక్రవారం కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బ్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో జనసేన కౌన్సిలర్ సభా మర్యాదను ఉల్లంఘించి కమిషనర్‌ను వేలెత్తి చూపి విమర్శించారు. 22వ వార్డు కౌన్సిలర్ భారతి సురేష్ వార్డు సమస్యను కమిషనర్‌కు చెప్పడానికి ఫోన్ చేస్తే ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేసి వేలు చూపుతూ ఊగిపోయాడు. ఈ సంఘటనకు కమిషర్ వెంకటేశ్వరరావుతోపాటుతో చైర్మన్ బర్రి శ్రీవెంకటరమణతోపాటు కౌన్సిల్లో సభ్యులంతా అవాక్కయ్యారు. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు సఖినేటిపల్లి సురేష్, కేసరి రాజు తదితరులు చొరవ తీసుకుని కౌన్సిలర్ సురేష్ క్షమాపణ చెపాలని కోరి ప్రయత్నించారు. స్పందన లేకపోవడంతో కమిషనర్ సిబ్బందితో సహా వాకౌట్ చేశారు. కౌన్సిల్ సమావేశం తొలుత సజావుగానే సాగింది. సమస్యలపై చర్చించారు. పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం ముగింపు దశకు వచ్చే సరికి భారతి సురేష్ మాటలతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కామన నాగిని, కొత్తపల్లి నాని, కౌన్సిలర్‌లు అబేదా సుల్తానా, జిల్లెళ్ల దిలీప్, ఏడిదకోట సత్యనారాయణ (వైకేఎస్), బొంతు రాజశేఖర్, కావలి రామసీత, పతివాడ పద్మ తదితరులు ఉన్నారు.

మణిపూర్‌లో మారణహోమం అమానుషం

నరసాపురం రూరల్: మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ నరసాపురం మండలం రుస్తుంబాద పంచాయతీలోని మంగళగుంటపాలెం లూథరన్ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి చర్చి ఆవరణలో శాంతి ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానికులతో కలసి, క్రైస్తవులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన ర్యాలీని చేశారు. పాస్టర్ జాన్ రత్నం, బాబూరావు, డేవిడ్‌రాజు, బందారు రమేష్, గోరింకల ఆలీవర్ తదితరులు పాల్గొన్నారు. నరసాపురం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, సీఐటీయూ పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా అర్హులకు లబ్ధి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



కేపీపాలెం సౌత్‌లో ఓ యువకుడికి వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు



నరసాపురం పట్టణంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: గత నెల రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ద్వారా అర్హులకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పాతపాడు, కేపీ పాలెం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 20 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న సురక్షలో 15 వేల అర్హత పత్రాలు పంపిణీ చేశామన్నారు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా 11 రకాల ధ్రువ పత్రాలను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాతపాడులో 870, కేపీ పాలెం సౌత్‌లో 1160 పత్రాలను అందించారు. పాతపాడులో జరిగిన కార్యకక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పంచాయతీ కార్యాలయంలో చూసుకున్నా ఇద్దరు, లేదా ముగ్గురు అధికారులు ఉండేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రతీ సచివాలయానికి సుమారు 20 శాఖలకు చెందిన ఉద్యోగులు ఉంటున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. కాళీపట్నం నుంచి పాతపాడు వరుకు సుమారు రూ14కోట్లతో రహదారి నిర్మిస్తున్నామని, అలాగే కేపీపాలెం నార్త్ పంచాయతీ మెట్రేవు నుండి పేరుపాలెం బీచ్ వరకూ నిర్మించే రహదారికి, మొగల్తూరు నుంచి కొత్తకాయలతిప్ప మీదుగా పేరుపాలెం సెంటర్ వరకూ నిర్మించే రహదారులకు త్వరలో శంకుస్థాపనలు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొప్పాడ లక్ష్మీ తులసి, అందే వెంకటలక్ష్మి, కడలి సోంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మల్లాడి శాంతి రత్నం, అందే ముక్తేశ్వరరావు, డీవివి సత్యనారాయణ, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ బందన పూర్ణచంద్రరావు, మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి, తహసీల్దార్ జి.అనితాకుమారి, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, నాయకులు కర్రి ఏసుబాబు, కొప్పాడ ఉమామహేశ్వరరావు, అల్లం అంజిబాబు, కొల్లాబత్తుల రవికుమార్, దొంగ నాగముని, రామాని మహేష్, అందే తాత, కంచర్ల బాబులు, కటికల సూర్యారావు, అల్లం చిన్న, పుచ్చకాయల ముక్తేశ్వరరావు, దొంగ శివన్నారాయణ పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో ముగిసాయి. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలలాలతో పాటు పట్టణంలోని వార్డు సచివాలయాలు వెరసి 69 సచివాలయాల వద్ద సుమారు 70వేల ధ్రువీకరణ పత్రాలు ఈ కార్యక్రమం ద్వారా అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలంలోని వేములదీవి వెస్ట్, ధర్బరేవు గ్రామ సచివాలయాలు, పట్టణంలోని 18,19.2 వార్డులకు సంబంధించిన సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. పట్టణంలో జరిగిన జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమంలో ఎమెల్యే ప్రసాదరాజు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకోవడానికి సహకరించిన అధికారులు, ప్రజా ప్రతినిదులు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లకు ప్రసాదరాజు అభినందనలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్ కామన నాగిని, కౌన్సిలర్ కేసరి గంగరాజు, యేడిదకోట సత్యనారాయణ (వైకేఎస్), వైస్ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, భూసారపు జయ, బుల్లిమస్తాన్, కావలి నాని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

యలమంచిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. పెనుమర్రు, నేరేడుమిల్లి గ్రామాలకు సంబంధించి పెనుమర్రు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ కవురు గోపి సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభసాయి వెంకట నరసింహారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పాకా సూర్యనారాయణ, సర్పంచ్‌లు చిలుకూరి సుబ్బారావు చౌదరి, పాలంకి శ్రీనివాసరావు పార్టీ నాయకులు బుద్ధరాజు జలదుర్గా వరప్రసాదరాజు (బుజ్జిరాజు), ఉచ్చుల స్టాలిన్, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాధవాయిపాలెం రేవులో నిలచిన పంటు

వరదతో పంటు ప్రయాణం నిలిపివేత

నరసాపురంరూరల్: నరసాపురంలో వరద ఉధృతి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పంటు ప్రయాణ రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో నరసాపురం రేవులో లంగరు వేశారు. విషయం తెలియక పంటు ద్వారా ప్రయాణం చేద్దామని వచ్చిన ప్రయాణికులు కొంతమేర అవస్థలు పడ్డారు. పంటు రాకపోకలు నిలివేయడంతో నిత్యం కోలాహలంగా కనిపించే రేవు వెలవెలబోయింది.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

నరసాపురంరూరల్: పొన్నపల్లిలో గోదావరి ఏటిగట్టుకు ఎలాంటి ఇబ్బందులు లేవని తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. గత సంవత్సరం వరదల సమయంలో దెబ్బతిని పునరుద్దరణ పనులు జరిగిన పొన్నపల్లి ఏటిగట్టు ప్రాంతాన్ని, డ్రెయిన్ స్లూయిజ్‌లు ఉన్న ప్రదేశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటిగట్టు పటిష్ట పనులు ఎమ్మెల్యే ప్రసాదరాజు కృషి వల్ల 50శాతం పూర్తయ్యాయని, ఎలాంటి వరదలనైనా తట్టుకోగలిగే స్థితిలో ఉన్నాయన్నారు. పొన్నపల్లి ఏటిగట్టు దిగువ ప్రాంతంలో శానిటేషన్ పనులను పరిశీలించారు.

పచ్చిరొట్ట పంటలపై దృష్టి సారించాలి



రైతులకు విత్తనాల కిట్లును అందిస్తున్న సర్పంచ్ పడవల మేరీ, ఏడీఏ అనిలకుమారి



బూరుగుపల్లిలో రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మొగల్తూరు: రైతులు పచ్చిరోట్ట పంటలపై దృష్టి సారించాలని ఏడీఏ ఇ.అనిలకుమారి సూచించారు.జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం(ఎస్‌సీ) కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొగల్తూరు3వ సచివాలయ పరిధిలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెంలోని ఎస్సీ రైతులకు నవధాన్యాల కిట్లు, కూరగాయల విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు విరివిగా వాడడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించిపోతున్నాయన్నారు. దీనివల్ల పంటలు పురుగులు,తెగుళ్ల బారిన పడుతున్నాయన్నారు. పచ్చి రొట్టలు వేయడం వలన భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, డివిజన ఇన్‌చార్జ్ ఎ.నరసింహరావు, మండల ఇన్‌చార్జ్ కె.లక్ష్మీకుమారి, జి.సునీల్ కుమార్, రైతులు జి.మావుళ్ళు, కేవీ సత్యనారాయణ, పుష్ప, మహలక్ష్మి పాల్గొన్నారు.

ఆకుమడుల పరిశీలన

ఆకుమడులు మునిగినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఏ ఇ.అనిల కుమారి సూచించారు. మండలంలోని రామన్నపాలెం, మొగల్తూరు 3సచివాలయ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిన ఆకుమడులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఏఓ అబ్దుల్ రహీమ్, రైతులు గుత్తుల గాంధీ, పడవల సత్యనారాయణ, చెల్లుబోయిన ఏడుకొండలు తదితరులున్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

యలమంచిలి: మనుషుల ఆరోగ్యానికి పెరటి పంటలే రక్షణ ఇస్తాయని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి చెప్పారు. బూరుగుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం గట్ల మీద, మెట్ట భూమిలో, ఇంటి పెరటిలో కంది విత్తనాలు పాతుకోవాలని కోరారు. ముందుగా వరి సాగులో మెళకువలు వివరిస్తూ రైతులు విచక్షణ రహితంగా ఎరవులు వేయవద్దని కోరారు. అనంతరం రైతులకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించి వరి సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు షరీఫ్ రైతులు బోనం బులివెంకన్న, పెంటపాటి నూకరాజు, అమ్మిరాజు, పెనుగొండ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.